ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 10-03-2026 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లాకు ఈ ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు.
2. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.
3. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ లో అర్బన్ నక్సల్స్, మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు ఎక్కువగా ఉన్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు.
4. కామారెడ్డిలో సమీకృత క్రీడా పాఠశాల లేదా క్రీడా గ్రామాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరారు.

---------------------------------------

గవర్నర్ స్వాగతం- రేవంత్ రెడ్డి

రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా ఈరోజు హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర

ఉన్నతాధికారులు గవర్నర్ కు  పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు. కాగా, గవర్నర్ రేపు ఉదయం లోక్ భవన్ లో ప్రమాణ స్వీకారం చేస్తారు.

**డెస్క్**

---------------------

అభివృద్ధే లక్ష్యంగా ప్రగతి ప్రణాళిక-మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం తప్పనిసరి అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ గూడూరి అంజలిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత కేవలం అభివృద్ధిపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, భద్రత, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి కీలక అంశాలపై దృష్టి సారించినట్లు మంత్రి వివరించారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

**( పీటీసీ, కరీంనగర్)**

---------------------

పొన్నం

ప్రతి గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇవాళ హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎస్ పోతారం గ్రామంలో పొన్నం ప్రభాకర్ పర్యటించి పశువులకు

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణకు FMD టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో పశు సంపద పెంచడానికి వ్యాదులు నివారించడానికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసే FMD టీకా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడాలని.. ప్లాస్టిక్ నిర్మూలించేలా కృషి చేయాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామానికి స్టీల్ బ్యాంక్ అందజేశామని వాటిని వినియోగించాలని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**పీటీసీ – సిద్దిపేట**

-------------------------------

బీజేపీ-రాంచందర్ రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ లో అర్బన్ నక్సల్స్, మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు ఎక్కువగా ఉన్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. అలాంటి భావజాలం ఉన్నవారితో తెలంగాణ విద్యా విధానం-2026 పేరిట రిపోర్ట్ తయారు చేయించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయని అన్నారు. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో "తెలంగాణ విద్యా విధానం – 2026" అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాంచందర్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్లు ప్రొఫెసర్ టి. పాపిరెడ్డి, ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. తిరుపతి రావు, NCERT మాజీ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ పి. మురళి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**(డెస్క్)**

-------------------------

కామారెడ్డి-ఎమ్మెల్యే కేంద్ర మంత్రి

కామారెడ్డి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధి కోసం సమీకృత క్రీడా పాఠశాల లేదా క్రీడా గ్రామాన్ని చేయాలని స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కేంద్ర యువజన

వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కోరారు. కామారెడ్డి పట్టణానికి ఆనుకుని ఉన్న సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తూ న్యూఢిల్లీలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. యువ ప్రతిభను ప్రోత్సహించడానికి.. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి కామారెడ్డి జిల్లాలో సమగ్ర క్రీడా మౌలిక సదుపాయాలు అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**(పీటీసీ, కామారెడ్డి)**

-----------------------

బీఆర్ఎస్ వర్క్ షాప్

హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక వర్క్ షాప్ ఈ ఉదయం ప్రారంభమైంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు, సీనియర్ నేత హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే వ్యూహాలు, రూల్‌బుక్‌పై న్యాయ నిపుణులు సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఇటీవల జరిగిన కీలక ఘటనలను సభలో ఎలా ఎండగట్టాలనే అంశంపై తారక రామారావు ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు.

**(పీటీసీ, హైదరాబాద్)**

----------------------

హైడ్రా

హైదరాబాద్ లోని కూకట్‌పల్లిలో హైడ్రా పునరుద్ధరించిన నల్ల చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇందిరా మహిళా శక్తి స్టాళ్లను సందర్శించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. చెరువుల పునరుద్ధరణ సమయంలో ఎదురైన విమర్శలను భరించానని, ఇప్పుడు ప్రజల ముఖాల్లోని చిరునవ్వే

తనకు ఆశీర్వాదంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. పేదవారి ఇళ్లను కూల్చడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, భవిష్యత్తులో ప్రజలు వరద ముంపునకు గురికాకూడదనే తపనతోనే ఈ పనులు చేపట్టినట్లు స్పష్టం చేశారు.

**పీటీసీ – హైదరాబాద్**

----------------------------

కవిత-ఖమ్మం

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితుల కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు ఈరోజు తెల్లవారుజామున భగ్నం చేసి, ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ఖమ్మం-వైరా ప్రధాన రహదారిపై బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు కవితతో పాటు మరో 33 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, బాధితులకు ఇళ్లు నిర్మించే వరకు ఆందోళన కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు. ఈ ఉదయానికి హైదరాబాద్ లో ఉన్న జాగృతి కార్యాలయానికి చేరుకున్న ఆమె వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా తన దీక్షను అక్కడే కొనసాగించనున్నట్లు తెలిపారు. బాధితుల ఇళ్లు కూల్చిన ప్రభుత్వమే వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

**పీటీసీ - ఖమ్మం**

-------------------------

షబ్బీర్ అలీ

నిజామాబాద్ ఖిల్లా రోడ్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున 'రంజాన్ తోఫా' కిట్లను వారు పంపిణీ చేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని షబ్బీర్ అలీ అన్నారు. మైనారిటీల సంక్షేమం కోసం విద్యా, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్

వివరించారు. విదేశీ విద్యానిధి, షాదీ ముబారక్ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వక్ఫ్ భూముల రక్షణతో పాటు ఉర్దూ భాషా వికాసానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి అన్ని విధాలా సహకారం అందిస్తామని నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**పీటీసీ – నిజామాబాద్**

--------------------------------

ఉగాది వేడుకలు

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19న రవీంద్రభారతిలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎక్కడా ప్రోటోకాల్ లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వేడుకల సన్నద్ధతను పర్యవేక్షించేందుకు 12న రవీంద్రభారతిలో అన్ని శాఖలతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**డెస్క్**

------------------------

ప్రగతి పాలన-కొత్తగూడెం

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏటీసీలో రెండు వారాల షార్ట్ టర్మ్ కోర్సులు ప్రారంభించారు. ఈ శిక్షణ కోర్సులకు ఎవరైనా హాజరు కావచ్చని, వయోపరిమితి లేదని, ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని ఐటీఐ ప్రిన్సిపల్ జీ. రమేష్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ ఐటిఐ కొత్తగూడెం నందు సంప్రదించవచ్చని ఆయన చెప్పారు.

**(పీటీసీ, కొత్తగూడెం)**

---------------------------

రైల్వే-వేసి ప్రయాణాలు

పెరగనున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ట్రాక్‌ల పటిష్టత, రైళ్ల సాఫీ కదలికల కోసం నిరంతర తనిఖీలు చేపట్టాలని అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. రాబోయే వేసవి దృష్ట్యా రైలు ప్రయాణాల భద్రతపై నిన్న సికింద్రాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు జోన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లను ఆయన పర్యవేక్షించారు. అలాగే నిర్మాణ ప్రాంతాల్లో భద్రతా నియమాలు పాటించాలని, ప్రైవేట్ సైడింగ్‌లు, గూడ్స్ షెడ్‌ల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఆరు డివిజన్ల డీఆర్‌ఎంలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పీఎస్**

--------------------------------

ప్రజా పాలన-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్ లో మున్సిపల్ కమిషనర్ గజానంద్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా ఆస్పత్రి ఎదుట రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక పైప్ లైన్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని సూచించారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

--------------------------------

బీటెక్-ఈవెనింగ్

రాష్ట్రంలో 12 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సాయంత్రం వేళ బీటెక్ కోర్సులను నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించింది. విద్యాశాఖ జీఓ 30 జారీ చేయగా, ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచే ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. పాలిటెక్నిక్ పూర్తి

చేసి కనీసం ఏడాది పని అనుభవం ఉన్నవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. ఈసెట్ కన్వీనర్ ద్వారా ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేయాలని ఉన్నత విద్యామండలి ఆదేశించింది.

**DESK**

----------------------------------

నిజామాబాద్-కలెక్టర్

నిజామాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగకూడదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ యాప్ ద్వారానే అనుమతులు తీసుకొని ఇసుక రవాణా చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. త్వరలో బోధన్, నవీపేట్, నిజామాబాద్ ప్రాంతాల్లో కొత్త సాండ్ బజార్‌లు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

**(PTC - కామారెడ్డి/నిజామాబాద్)**

----------------------------

వనపర్తి-ఎమ్మెల్యే

వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి గారు అన్నారు. ఈ ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

**( పీటిసి ,వనపర్తి జిల్లా )**

---------------------------

కామారెడ్డి-ఎమ్మెల్యే

మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఇందులో భాగంగానే ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని 114 గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా

సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలకు శాశ్వత వేదికగా మారనున్నాయి.

**(PTC – కామారెడ్డి)**

------------------------------

జనగామ - HPV టీకా

HPV టీకా వేయించడం వల్ల బాలికలకు  గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ సంజయ్ కుమార్ జా తెలిపారు. ఈ ఉదయం జనగామ పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఈ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బాలికల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తప్పనిసరిగా టీకా వేయించాలని ఆయన సూచించారు.

**(పీటీసీ, జనగామ)**

------------------------------

సిరిసిల్ల-కలెక్టర్

ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా  జిల్లా కలెక్టరేట్  సమీకృత కార్యాలయాల సముదాయంలో  ఈ రోజు స్వచ్ఛత - పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా కలెక్టర్ హాజరై తనిఖీ చేశారు.

**(పీటీసీ, సిరిసిల్ల)**

--------------------------------